క్లుప్తంగా

రైతాంగానికి అండగా కేంద్ర ప్రభుత్వం

శాయంపేట : రైతాంగానికి కేంద్రం ప్రభుత్వం అండగా నిలిచి 14 రకాల పంటలకు మద్దతు ధర పెంచడం హర్షనీయమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాయరాకుల మొగిలి శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైతుల కష్టాలను గుర్తించి 14 రకాల పంటలకు మద్దతు ధర ప్రకటించారని అన్నారు. ప్రస్తుతం వరికి క్వింటాల్ ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,320 ఉండగా కేంద్ర ప్రభుత్వం తాజాగా రూ.69 మద్దతు ధర ప్రకటించడంతో రూ.2,389కి చేరిందన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఆత్మకూరు : తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కార్యదర్శి ఇర్సడ్ల సదానందం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విధంగా ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో పాటు, రూ. 25 వేల పింఛన్ ఇవ్వాలని, అలాగే ఉద్యమకారుల కోసం రూ.10 వేల కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు.

కొనసాగుతున్న దుర్గామాత ఉత్సవాలు

ఐనవోలు : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో దుర్గామాత ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కాగా చివరి రోజు శుక్రవారం ప్రముఖ కవి, గాయకుడు సంగీత దర్శకుడు వరంగల్ శ్రీనివాస్ దుర్గమాత అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కమిటీ నిర్వాహకులు మేట చిరంజీవి, గాయకులు ఇనుగుర్తి మధు, కామెర దీపక్, మల్లయ్య, నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి శ్రీధర్‌బాబు జన్మదినం

కమలాపూర్ : రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలి వద్ద కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి-రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేశ్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూడ శ్రీకాంత్, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు గుండవు చరణ్‌పటేల్, నాయకులు పోడేటి భిక్షపతి, పరుమాండ్ల పర్శరాములుగౌడ్, కొండపాక మనీష్, ఆడెపు శ్రీకాంత్, ఆన్‌కార్ అశోక్, మస్న చంద్రశేఖర్, విష్ణుదాసు వంశీ, మాట్ల రవీందర్ పాల్గొన్నారు.

స్టేషన్ మెట్లెక్కిన గెట్టు పంచాయితీ


- కేసు నమోదు

ఆత్మకూరు : పత్తి చేను దగ్గర మొదలైన గెట్టు పంచాయితీ పోలీస్‌స్టేషన్ మెట్లెక్కింది. స్థానిక పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. అగ్రంపహాడ్ గ్రామానికి చెందిన బోరిగం వీరయ్య, భార్య ఉమారాణితో కలిసి భూమిలో పత్తి గింజలు విత్తుతున్నారు. ఈ క్రమంలో పక్క భూమిలో ఉన్న అవుల రాంబాబు, ఆయన భార్య త్రివేణి వ్యవసాయ పనులు చేస్తున్నారు. విత్తనాలు విత్తుతున్న సమయంలో గెట్టు వద్ద మాటామాట పెరిగి గొడవకు దారితీసింది. దీంతో రాంబాబు, ఆయన భార్య త్రివేణి దూషిస్తూ వచ్చి వీరయ్యను కర్రతో కొట్టి గాయపర్చారు. అడ్డుకోబోయిన వీరయ్య కుమార్తె కల్యాణిని కూడా దూషించారు. కాగా రాంబాబు, త్రివేణిపై ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం బాధితుడు వీరయ్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

నియామకం

శాయంపేట : సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మండల కేంద్రానికి బత్తిని సదానందం, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా అనుకారి అశోక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి భిక్షపతి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 26,27వ తేదీల్లో హసన్‌పర్తి మండల కేంద్రంలో జరిగిన 2వ మహాసభల్లో ఈ నియామకం జరిగినట్లు పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ ర్యాలీని జయప్రదం చేయాలి



ఆత్మకూరు : నేడు వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మురళి పిలుపునిచ్చారు. మండలంలోని నీరుకుళ్లలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశ్రీ అవార్డు స్వీకరించిన అనంతరం ఈనెల 31వ తేదీన వరంగల్‌కు వస్తున్న మంద కృష్ణమాదిగకు ఘనంగా స్వాగతం పలకాలన్నారు. అదే రోజు జరగనున్న సభను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు పాల్గొన్నారు.

నెరవేరని హామీలు..!

- 30 పడకలుగా అప్‌గ్రేడ్‌కాని ఆస్పత్రి
- రోగులకు అందని 24 గంటల వైద్యం
- పాలకుల హామీలపై ప్రజల విమర్శలు
- ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు



ఐనవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఐనవోలు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉంచడంతో పాటు 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామని పలుమార్లు ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు గాలికి కొట్టుకుపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మెరుగైన వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో స్థానిక ప్రజలు అనారోగ్యం బారిన పడి ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొందని పలువురు ఆగ్రహిస్తున్నారు. అత్యవసర సేవలు అందుబాటులో లేకపోవడంతో రాత్రి సమయంలో విష సర్పాలు కాటు వేస్తే 30 కిలో మీటర్ల దూరం ప్రయాణించి వరంగల్ పట్టణానికి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని, దీంతో ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని వారు వాపోతున్నారు. సకాలంలో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఐనవోలు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. ఈ పీహెచ్‌సీ పరిధిలో వేలాది కుటుంబాలు నివాసం ఉంటున్నారు. ముఖ్యంగా గర్భిణులు నెలవారి చెకప్‌లకు వస్తున్నప్పటికీ ప్రసవం, అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. దీంతో పేద ప్రజలకు వైద్యం భారంగా మారుతుంది. ఐనవోలు పీహెచ్‌సీ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే వైద్య సేవలు అందుబాటులో ఉండడంతో అత్యవసర సమయాల్లో రోగులతో పాటు గర్భిణులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని, దూర భారంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆ నాలుగు రోజులే 24 గంటల వైద్యం

మండల కేంద్రంలో మల్లికార్జున స్వామి దేవాలయం ఉండటంతో నిరంతరం భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. దీంతో నిరంతర వైద్య సేవలు అవసరమని ప్రభుత్వానికి, ప్రజలకు కొన్ని సంవత్సరాలుగా ప్రజలు విజ్ఞప్తులు చేస్తున్నారు. అవసరాన్ని గుర్తించిన స్థానిక ప్రజాప్రతినిధులు గతంలో మంత్రుల దృష్టికి తీసుకెళ్లగా వారు హామీ ఇచ్చారు కానీ ఆచరణలో సాధ్యం కాలేదు. ప్రతి ఏడాది సంక్రాంతి నుంచి ఉగాది వరకు దేవస్థానం నిర్వహించే బ్రహ్మోత్సవ జాతరలో లక్షల మంది భక్తులు పాల్గొంటారు. ఇలాంటి కీలక సమయంలో కేవలం నాలుగు రోజులు తాత్కాలికంగా 24 గంటల వైద్య సేవలు అందించి చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

> **నిరంతర వైద్యం అందించాలి**
>
> భక్తులు ఎక్కువగా ఉండే ప్రాంతం, యాత్రా స్థలం కావడం వలన ప్రభుత్వం దృష్టి సారించి నిరంతరాయంగా వైద్యులను అందుబాటులో ఉంచి వైద్య సేవలు అందించాలి. 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి. దీంతో గర్భిణులకు కూడా ప్రసవానికి సౌకర్యంగా ఉంటుంది.
>
> – దేవేందర్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు

తుపాకీతో రాజ్యాధికారం సాధ్యం కాదు

- 'కగార్'ను ఆపాలనడం విడ్డూరం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంతోశ్‌కుమార్



షాహీద్ గొడిశాల అరవింద్‌గౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పరకాల : అభివృద్ధికి అడ్డంకిగా మారిన నక్సలైట్లను ఏరిపారేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను చేపడితే మేధావుల ముసుగు వేసుకున్న అర్బన్ నక్సలైట్లు తుపాకి గొట్టం ద్వారానే రాజ్యాధికారం సాధ్యమంటూ అమాయకులను ఎగేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోశ్‌కుమార్ వ్యాఖ్యానించారు. నక్సలైట్లు సమసమాజ స్థాపన అంటూ ఎంతో మంది అమాయక ప్రజలను, జాతీయవాదులను, పోలీసులను, గిరిజనులను పొట్టనబెట్టుకుంటున్నారని విమర్శించారు. బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో షహీద్ గొడిశాల అరవింద్‌గౌడ్ 26వ వర్ధంతి బీజేపీ కార్యాలయంలో శుక్రవారం జరుగగా ఆయన పాల్గొని మాట్లాడారు. పరకాల ప్రాంతంలో రాడికల్స్, నక్సలైట్స్, గుండాలు ఉనికి కోసం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఉన్మాదులుగా ప్రవర్తిస్తున్న సమయంలో సిద్ధాంతం కోసం పోరాడిన గొప్ప నాయకుడు అరవింద్‌గౌడ్ అని కొనియాడారు. ఎంతో మంది నాయకులను నక్సలైట్లు పొట్టనబెట్టుకున్నా ఈ ప్రాంతంలో బీజేపీ, జాతీయవాద సిద్ధాంతం పెరిగిందేకానీ తగ్గలేదన్నారు. పట్టణ అధ్యక్షుడు నిరంజన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, జిల్లా కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, నాయకులు దేవునూరి మేఘనాథ్, మార్త రాజభద్రయ్య, చందుపట్ల రాజేందర్‌రెడ్డి, కుక్కల విజయ్‌కుమార్, పురుషోత్తం, నారాయణదాసు, రంజిత్, శ్రీనివాస్‌రెడ్డి, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

11 కేవీ లైన్ల మరమ్మతు



సాక్షి ఎఫెక్ట్..

శాయంపేట : మండల కేంద్రంలోని బీసీ కాలనీ బోరింగ్ వద్ద 11 కేవీ విద్యుత్ లైను ఎల్‌టీ లైన్‌పై పడి 14 వీధి లైట్లు పేలిపోయిన విషయం తెలిసిందే. కాగా శుక్రవారం సాక్షి దినపత్రిలో 'విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పేలిన వీధి లైట్లు' కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు మరమ్మతు చేపట్టారు.

ముళ్లచెట్లను తొలగిస్తాం

సాక్షి స్పందన

నడికూడ : పరకాల–హుజూరాబాద్ ప్రధాన రహదారికిరువైపులా ముళ్లచెట్లు పెరిగి వాహనదారులకు ఇబ్బందిగా మారిన విషయం తెలిసిందే. కాగా సాక్షి దినపత్రిలో శుక్రవారం 'ప్రమాదకరంగా ముళ్లచెట్లు' అనే కథకం ప్రచురితమైంది. దీంతో పరకాల ఆర్ అండ్‌బీ డీఈ పి.రాజు స్పందించారు. త్వరలో ముళ్ల చెట్లను తొలగించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేస్తామని సాక్షికి తెలిపారు.

కాల్వల్లోనే చెత్తాచెదారం, కోళ్లవ్యర్థాలు



మండల కేంద్రంలోని వాగులో వేసిన చెత్తాచెదారం, వ్యర్థాలు

వేలేరు : చెత్తాచెదారం, వ్యర్థాల కోసం డంపింగ్ యార్డులను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినా కొంతమంది తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తూ ఆయా గ్రామాల సమీపంలోని కాలవ్లో వేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతుంది. కొంతమంది చికెన్ సెంటర్‌ల నిర్వాహకులు కుళ్లిపోయిన కోళ్ల వ్యర్థాలు కాల్వల్లో వేస్తుండటంతో వాహనదారులు ముక్కుమూసుకోవాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. ఇటీవల గతంలో గ్రామపంచాయతీ అధికారులు చికెన్ సెంటర్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినా బేఖారు చేశారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలవ్లో చెత్తాచెదారం, వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

'ఎమ్మెల్యే చొరవతోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు'

వర్ధన్నపేట : స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు చొరవ తీసుకోవడం వల్లే నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైందని యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు బిర్రు రాజు తెలిపారు. పట్టణంలోని శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలు నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించాయని తెలిపారు. పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య అందించేలా రూ.200 కోట్ల వ్యయంతో తలపెట్టిన స్కూల్ మంజూరు చేయించే దిశగా ఎమ్మెల్యే కృషి చేశారని చెప్పారు. నియోజకవర్గ పేద విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి విద్య అందుకోనున్నారని హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

- హెచ్‌ఎం అశోక్‌కుమార్



బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు (దామెర) : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తుందని పులకుర్తి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అశోక్ కుమార్ అన్నారు. దామెర మండలంలోని పులకుర్తి గ్రామంలో శుక్రవారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. హెచ్‌ఎం అశోక్ కుమార్, ఉపాధ్యాయులు రవీందర్, రమాదేవి, రంజాన్, కుమార్, అమీదా భాను, సృజన, సుధాకర్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు మృతి

దుగ్గొండి : మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు బైగాని వీరస్వామి (74) అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. ఆయన ఓ ప్రధాన తెలుగు పత్రికలో సుమారు 36 ఏళ్లుగా విలేకరిగా సేవలు అందించిన క్రమంలో ఆయన మృతితో మండలంలో విషాదం నెలకొంది. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. వీరస్వామి కుమారుడు రఘును అమెరికా పర్యటనలో ఉన్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. వీరస్వామితో తనకున్న నాలుగు దశాబ్దాల అనుబంధం మరవలేనిదని చెప్పారు. వీరస్వామి మృతదేహానికి నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు.

'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం జిల్లా కార్యదర్శి సమ్మయ్య



వినతిపత్రం ఇస్తున్న సమ్మయ్య, నాయకులు

నర్సంపేట : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం ఆర్డీఓ కార్యాలయ అధికారికి శుక్రవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసింది. అనంతరం సమ్మయ్య మాట్లాడారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ నిర్వీర్యానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. ఏటా వంద రోజుల పని కల్పించాల్సి ఉండగా కనీసం 30 రోజులు కూడా సక్రమంగా చూపించడం లేదన్నారు. కూలీలందరికి పనులు కల్పించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టడం లేదని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు సకాలంలో వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఉపాధి హామీ కూలీలకు పూర్తి స్థాయిలో పనులు కల్పించడంతోపాటు ఎప్పటికప్పుడు కూలి చెల్లించాలని, ఫీల్డ్ అసిస్టెంట్లను రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నమిండ్ల స్వామి, ఉపాధ్యక్షుడు బోళ్ల సాంబయ్య, నాయకులు పుచ్చకాయల నర్సింహారెడ్డి, ఇస్లావత్ రవి, పెండ్యాల సారయ్య, బస్కె మొగిలి, నీరటి బాలకొమురు, జన్ను అశోక్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అలరిస్తున్న చిందు యక్షగానం



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

వర్ధన్నపేట : పట్టణంలోని 10వ వార్డులో గజవెల్లి వెంకన్న బృందం శుక్రవారం ప్రదర్శించిన చిందు యక్షగానం స్థానికులను అలరించింది. కళాకారులు 'సతీ తులసి' నాటిక ప్రదర్శించగా ప్రేక్షకులు మంత్రముగ్ధులై తిలకించారు. నాటికలోని పాత్రదారుల హావభావాలు, సన్నివేశాలు, యక్షగానం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాకారులు అయిత యాకాంతం, హన్మకొండ లక్ష్మి, కె.రమేశ్, కె.కుమార్, దూడయ్య, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరిస్తా

- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



మంత్రి సురేఖకు వినతిపత్రం అందజేస్తున్న గౌడ సంఘం పెద్దలు

ఆత్మకూరు : గౌడ కులస్తుల ఆరాధ్య దైవం ఆదిపరాశక్తి అంశతో జన్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి సహాయ, సహకారాలు అందిస్తానని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో గౌడ సంఘం కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న రేణుకా ఎల్లమ్మ దేవాలయానికి కావాల్సిన నిధులు కేటాయించాలని గౌడ సంఘం కులస్తులు ఆమెను హనుమకొండలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి సహాయ, సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. అమ్మవారి అనుగ్రహం ఉంటేనే ప్రజలందరూ సుఖ, సంతోషాలతో ఉంటారన్నారు. మండల కేంద్రంలో రేణుకా ఎల్లమ్మ దేవాలయం నిర్మాణం చేయడం అభినందనీయమని గౌడ సంఘం పెద్దలు అభినందించారు. చేసే ప్రతి పనిలో రాణించాలంటే దైవ అనుగ్రహం ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. దేవాలయ నిర్మాణం చేసి నిత్య పూజలు జరిగే విధంగా చూడాలని గౌడ సంఘం పెద్దలకు మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, గౌడ సంఘం పెద్దలు పొగాకుల కొమురయ్యగౌడ్, గుర్రం ప్రభాకర్ గౌడ్, పొగాకుల రమేశ్‌గౌడ్, భయగాని రమేశ్‌గౌడ్, ఆత్మకూర్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బయ్య కుమారస్వామి పాల్గొన్నారు.

'నాసిరకం' రవాణాపై నిఘా

- ఏసీపీ సతీశ్‌బాబు



పరకాల : ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న ఏసీపీ సతీశ్‌బాబు, ఏఓ శ్రీనివాస్

పరకాల : నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామని పరకాల ఏసీపీ సతీశ్‌బాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బిల్లు బుక్కులను పరిశీలించిన అనంతరం వ్యాపారస్తులతో మాట్లాడారు. రైతులను మోసం చేయాలనుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారస్తులు బిల్లు లేకుండా విత్తనాలు, ఎరువులు విక్రయించొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీనివాస్, సీఐ క్రాంతికుమార్, రైతులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు

శాయంపేట : ఫర్టిలైజర్ దుకాణాదారులు రైతులకు నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ గంగాజమున అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాయి ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, బిల్లు బుక్కులు, లైసెన్సు, విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. లూజుగా విత్తనాలు విక్రయించొద్దని సూచించారు. షాపు యాజమానులు రిజిస్టర్లు, బిల్లు బుక్కులు, రైతు వారీగా విక్రయాల వివరాలతో కూడిన రిజిస్టర్లను తప్పనిసరిగా మెయింటన్ చేయాలన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీతోనే సంక్షేమ పథకాలు

- ఏఓ గంగాజమున



మాట్లాడుతున్న ఏఓ గంగాజమున

శాయంపేట : ఫార్మర్ రిజిస్ట్రీతోనే రైతులకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలవుతాయని ఏఓ గంగాజమున అన్నారు. మండలంలోని తహరాపూర్ గ్రామంలో శుక్రవారం ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఆధార్‌తో దేశంలోని ప్రతి పౌరుడికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతి రైతుకు 11 నంబర్లతో విశిష్ట సంఖ్య (యూనికోడ్)ని కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలని సంకల్పంతో ఈ ప్రాజెక్టు చేపట్టిందన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు తనకు ఉన్న భూములకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారంతో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ ఉంటుందని, రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూ యాజమాన్య వివరాలను రైతుల ఆధార్ సంఖ్యకు అనుసంధానం చేయించి ఫార్మర్ ఐడీని కేటాయించడం జరుగుతుందన్నారు. పీఎం కిసాన్ లబ్ధిదారులకు తదుపరి విడత లబ్ధి పొందేందుకు ప్రామాణికంగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన పథకాలైన రైతు భరోసా, రుణమాఫీ తదితర పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రీకి ఏలాంటి సంబంధం లేదన్నారు. రైతు విశిష్ట సంఖ్యను(ఫార్మర్ ఐడీ) పొందేందుకు రైతులు ఆధార్, భూ యాజమాన్య పాస్ పుస్తకం, ఆధార్‌కు లింక్ చేయబడిన మొబైల్ నంబర్ తీసుకుని సమీపంలోని వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి ఫార్మర్ ఐడీకి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాకేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి నుంచే బలోపేతం చేయాలి

- మాజీ మంత్రి విజయరామరావు



మాట్లాడుతున్న విజయరామరావు

వేలేరు : బీజేపీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామరావు అన్నారు. శుక్రవారం మండలంలోని కమ్మరిపేట గ్రామంలో గల ఆయన నివాసంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో బూత్ కమిటీల నిర్మాణం ఉంటేనే పార్టీ పూర్తిస్థాయిలో బలోపేతమవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వివరించాలన్నారు. మండలంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన అంశాలపై శ్రేణులకు పలు సూచనలు చేశారు. అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల నుంచి పార్టీ తరుపున పోటీ చేసేందుకు అభ్యర్థులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కాట్రేవుల రాజు, నాయకులు కిరణ్, కనుకచారి, శివాజీ, నవీన్, నాగరాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల నడవడికను గమనించాలి

- సీఐ పులి రమేశ్



అవగాహన కల్పిస్తున్న సీఐ పులి రమేశ్

ఎల్కతుర్తి : తల్లిదండ్రులు పిల్లల నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలని సీఐ పులి రమేశ్ సూచించారు. శుక్రవారం ఎల్కతుర్తి మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ముఖ్యంగా చిన్న పిల్లలకు మొబైల్స్ ఇవ్వొద్దని అన్నారు. దీని వలన ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లతో డబ్బులు పోగొట్టుకునే ప్రమాదం ఉందన్నారు. అలాగే గుట్కా, గంజాయి తదితర మత్తు మదార్థాలకు, వ్యసనాలకు గురికాకుండా గమనిస్తూ ఉండాలని అన్నారు. యువత పెడదారి పట్టకుండా పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయం, రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గుర్తుతెలియని అపరిచితులు ఫోన్‌లో బ్యాంక్ ఖాతాలు, ఓటీపీలు అడిగితే చెప్పవద్దని అన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని అప్రమత్తంగా ఉండాలన్నారు.